సాక్షి మహబూబ్‌నగర్

గురువారం । 3 । అక్టోబర్ । 2024



'కురుమూర్తి' కిటకిట

కురుమూర్తిస్వామి కొండలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి.

వివరాలు 10లో ▸



ఉత్సవాలకు వేళాయె

జోగుళాంబ ఆలయంలో గురువారం నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
39.4 /21.5

వాతావరణం

ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: డీఎస్సీ–2024 రాత పరీక్ష ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాకు సంబంధించి 1:3 నిష్పత్తి ప్రకారం 729 మంది అర్హత సాధించారు. మొత్తం 243 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగా, మొదటిరోజు బుధవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో 379 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 114 మంది మాత్రమే వచ్చారు. దీంతో వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను డీఈఓ రవీందర్ ఆధ్వర్యంలోని కమిటీ పరిశీలించింది. ఈ నెల 5వ తేదీ వరకు గడువు ఉండటంతో మిగతావారు ఆలోగా తప్పక హాజరు కావాలని సూచించారు.

నేడు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు

స్టేషన్ మహబూబ్‌నగర్: వరంగల్‌లో ఈ నెల 7, 8 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి (అండర్–14, 16, 18, 20) అంతర్‌జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను గురువారం ఉదయం 9 గంటలకు స్థానిక స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు తహసీల్దార్ ద్వారా కులధృవపత్రం, మున్సిపాలిటీ నుంచి జననధృపత్రం, ఎస్ఎస్‌సీ మెమోలతో కోచ్ సునీల్‌కుమార్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



కోస్గి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ టోర్నీ ప్రారంభం కానుంది. అండర్–17 విభాగంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఉమ్మడి పది జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు, 50 మంది కోచ్, మేనేజర్లు హాజరవుతున్నారని టోర్నమెంట్ ఆర్గనైజర్ బాల్‌రాజ్ తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల ప్రారంభోత్సవానికి కలెక్టర్ సిక్తా పట్నాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీఈఓ అబ్దుల్ ఘనీ తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఏర్పాట్లను పరిశీలించారు. హ్యాండ్ బాల్ సెక్రెటరీ జియావుద్దీన్, త్రోబాల్ సెక్రెటరీ ఆసీఫ్, ఫిజికల్ డైరెక్టర్ నర్సిములుతో పాటు పలువురు ఉన్నారు.



వనపర్తి జిల్లా నాగవరం శివారులో పొలాలకు వెళ్లే దారిలో డంప్ చేసిన చెత్త

బయోత్పాతం

ఆస్పత్రుల్లో అస్తవ్యస్తంగా వ్యర్థాల నిర్వహణ

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్లక్ష్యంగా మెడికల్ వేస్టేజ్ సేకరణ
- నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ చెత్త ట్రాక్టర్లకు అందజేత
- వ్యర్థాలను చెత్తలో కలిపేయడంతో మరింత ప్రమాదం
- డబ్ల్యూహెచ్‌ఓ, పీసీబీ నిబంధనలు బేఖాతరు
- పట్టించుకోని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబొరేటరీల్లో వెలువడుతున్న బయోమెడికల్ వ్యర్థాల సేకరణ నిబంధనల ప్రకారం సాగడం లేదు. ఆస్పత్రుల్లో పోగుపడుతున్న బయో మెడికల్ వ్యర్థాలను మున్సిపాలిటీ సిబ్బంది సేకరిస్తూ డంపింగ్‌యార్డులకు చేరుస్తుండటంతో సిబ్బంది అనారోగ్యం బారిన పడాల్సివస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని బయోమెడికల్ వ్యర్థాల సేకరణను ప్రభుత్వం ఓ ప్రైవేటు ఇన్సినరేటరీ ఏజెన్సీకి అప్పగించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ సంస్థలు 11 ఉన్నాయి. ఆయా సంస్థలతో ఆస్పత్రులు అనుసంధానమై బయో మెడికల్ వేస్టేజ్‌ను అప్పగించాల్సి ఉంటుంది. ఇందుకోసం సంబంధిత ఏజెన్సీకి ఆస్పత్రులు ఒక్కో బెడ్‌కు రూ.7 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఉమ్మడి జిల్లాలో ఆస్పత్రుల నుంచి బయో మెడికల్ వేస్టేజ్ సేకరణ సక్రమంగా సాగడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మున్సిపల్ సిబ్బందికి అవగాహన లేక..

ఆస్పత్రుల్లో బయోమెడికల్ వ్యర్థాలను సంబంధిత ఇన్సినరేటరీలు సేకరించాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా కన్పిస్తోంది. ప్రమాదకరమైన బయోమెడికల్ వేస్టేజ్ మున్సిపాలిటీ డంపింగ్ యార్డులకు చేరుతోంది. ఈ వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది ఎట్టిపరిస్థితుల్లో సేకరించవద్దని కఠిన చట్టాలు, నిబంధనలు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అసలు వీటిపై సిబ్బందికి సరైన అవగాహన లేదు. మున్సిపల్ సిబ్బంది బయోమెడికల్ వ్యర్థాలను సేకరించడం, వాహనాల్లో తరలించడం, డంపింగ్ యార్డులో నిల్వ చేస్తుండటంతో సిబ్బందితో పాటు సమీప ప్రాంత ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు. బయోమెడికల్ వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి ఇన్సినరేటరీలకు అప్పగించాలి కానీ ఇతర వ్యర్థాలతో కలపవద్దన్న నిబంధనలను ఆస్పత్రులు పాటించడం లేదు. ఫలితంగా హానికరమైన బయోమెడికల్ వ్యర్థా లు జనారోగ్యానికి, జంతువులకు ప్ర మాదకరంగా పరిణమిస్తున్నాయి.



నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని మున్సిపల్ డంప్ యార్డుకు చేరిన బయోమెడికల్ వ్యర్థాలు

రోజుల తరబడి నిల్వతో ప్రమాదం..

ప్రభుత్వం నిర్దేశించిన ఏజెన్సీతో బయోమెడికల్ వేస్టేజ్ నిర్వహణపై ప్రతి ఆస్పత్రి ఒప్పందం కుదుర్చుకోవాలి. అందుకు అవసరమైన చార్జీలను ఆస్పత్రులు చెల్లించాలి. కానీ చాలా ఆస్పత్రుల నిర్వహణ భారం పేరుతో ఇన్సినరేటరీలకు అప్పగించకుండా మున్సిపాలిటీ సిబ్బందికే బయోమెడికల్ వేస్టేజ్‌ను అప్పగిస్తున్నారు. ఆస్పత్రిలో పోగైన బయో మెడికల్ వేస్టేజ్‌ను 48 గంటల్లోగా సంబంధిత ఇన్సినరేటరీకి అప్పగించాల్సి ఉండగా, వారం నుంచి పది రోజుల పాటు నిల్వ చేస్తూ బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు ఉన్న ఆస్పత్రులు పాటించడం లేదు. సంబంధిత అధికారులు సైతం పట్టించుకోవడం లేదు.

నిబంధనలు పాటించేలా చూస్తాం..

ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని బయో వేస్టేజీను తప్పనిసరిగా సంబంధిత ఇన్సినరేటరీలు తీసుకెళ్లాలి. ఆస్పత్రులు బయో వేస్టేజ్‌ను ప్రత్యేకమైన డబ్బాల్లో సేకరించి ఇన్సినరేటరీలకు అప్పగించాలి. త్వరలోనే ఆస్పత్రుల్లో విజిట్ నిర్వహించి, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం. సంబంధిత ఇన్సినరేటరీలు బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చూస్తాం.

– స్వరాజ్యలక్ష్మి, డీఎంహెచ్‌ఓ, నాగర్‌కర్నూల్

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వివరాలు

మహబూబ్‌నగర్	జోగుళాంబ గద్వాల	నాగర్‌కర్నూల్	నారాయణపేట	వనపర్తి
205	148	136	123	113

ప్రత్యేక బ్యాగుల్లో వ్యర్థాల సేకరణ..

ఆస్పత్రులు, నర్సింగ్‌హోంలు, క్లినిక్‌లు, డిస్పెన్సరీలతో పాటు పశువైద్య సంస్థలు, బ్లడ్‌బ్యాంకులు, ఆయుష్ ఆస్పత్రులు, పరిశోధన విద్యాసంస్థలు, ఆరోగ్య శిబిరాలు, ఆపరేషన్ థియేటర్ల నుంచి బయో మెడికల్ వ్యర్థాలు వెలువడుతాయి. వీటిని నాలుగు రకాలుగా విభజించి నిల్వ చేయాలని డబ్ల్యూహెచ్‌ఓ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. రెడ్, ఎల్లో, వైట్, బ్లాక్ బ్యాగులను కేటాయించి వీటిల్లో విడివిడిగా బయోమెడికల్ వ్యర్థాలను సేకరించాల్సి ఉంటుంది. సిరంజీలు, సాయిల్డ్, గ్లౌసులు, కాథెటర్స్, ఐవీ ట్యూబులను రెడ్ కలర్ బ్యాగ్‌లో వేయాలి. బాడీ ఫ్లుయిడ్స్, బ్లడ్‌బ్యాగులు, మానవ శరీర వ్యర్థాలు, శరీర భాగాలతో కూడిన డ్రెస్సింగ్ పట్టీలను ఎల్లో బ్యాగులో వేయాల్సి ఉంటుంది. సూదులు, షార్ప్‌లు, బ్లేడ్‌లను వైట్ పంక్చర్ ప్రూఫ్ కంటైనర్(పీపీసీ) బ్యాగులో వేయాలి. బయోమెడికల్ కాని వ్యర్థాలను బ్లాక్ కలర్ బ్యాగులో వేయాల్సి ఉంటుంది. ఆస్పత్రులు ఈ నిబంధనలను అమలుచేయాల్సి ఉండగా చాలా వరకు పాటించడం లేదు. ఫలితంగా బయోమెడికల్ వ్యర్థాలు సాధారణ వ్యర్థాల్లో కలిసిపోతున్నాయి.

ముగిసిన 'స్వచ్ఛత హీ సేవ'



చెత్తను సేకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో గత నెల 17 నుంచి కొనసాగిన 'స్వచ్ఛత హీ సేవ' బుధవారంతో ముగిసింది. చివరి రోజు బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో శ్రమదానం నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు 50 కిలోల చెత్తను సేకరించి పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. 15 రోజుల పాటు ఈ కార్యక్రమంలో చేపట్టిన వివిధ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందులో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మెప్మా, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లకే తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, వజ్రకుమార్‌కుమార్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ చరణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ 15 రోజులలో చెత్తను సేకరించడం, పట్టణ పరిశుభ్రతపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. జిల్లా ప్రధాన స్టేడియం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యంగా జనసమ్మర్థ ప్రాంతాలైన బస్టాండు, రైల్వే స్టేషన్, పర్యాటక ప్రాంతం పిల్లలమర్రిలోనూ చెత్తను సేకరించి, ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర, చిత్రంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు

- నేటి నుంచి 7వ తేదీ వరకు ఇంటింటి సర్వే
- పైలెట్ ప్రాజెక్టుకు నియోజకవర్గానికో గ్రామం, వార్డు చొప్పున ఎంపిక
- కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు ఇవ్వాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక అర్బన్ వార్డు, గ్రామ పంచాయతీని పైలెట్ ప్రాజెక్ట్‌గా సర్వే బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ విజయేందిర తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కుటుంబ డిజిటల్ కార్డ్ హౌస్‌హోల్డ్ సర్వే కోసం ఏర్పాటు చేసిన బృందాలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంపిక చేసిన గ్రామం, వార్డులో గురువారం నుంచి 7 తేదీ వరకు ఐదు రోజుల పాటు సర్వే నిర్వహించాలని సూచించారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో హన్వాడ మండలం మాదారం, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో 37వ వార్డు, జడ్చర్ల నియోజకవర్గంలో అల్వాన్‌పల్లి, జడ్చర్ల మున్సిపాలిటీలో 24వ వార్డు, దేవరకద్ర నియోజకవర్గంలో చిన్నచింతకుంట మండలం సీతారాంపేట, భూత్పూరు మున్సిపాలిటీలో 9వ వార్డును పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. సర్వేకు టీమ్ లీడర్లుగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, టీమ్ సభ్యులుగా పంచాయతీరాజ్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. టీమ్ లీడర్లు, సభ్యులు అందరూ క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన గ్రామం, వార్డులో కుటుంబ వివరాలు సేకరించాలన్నారు. ప్రజలు అందుబాటులో ఉండాలని, తమ కుటుంబ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మహబూబ్ నగర్ నియోజవర్గం పర్యవేక్షణాధికారిగా ఆర్డీఓ, జడ్చర్ల నియోజకవర్గానికి జెడ్పీ సీఈఓ, దేవరకద్ర నియోజకవర్గానికి భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లను నియమించినట్లు తెలిపారు సర్వేకు ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆర్‌పీలు, అంగన్‌వాడీల సహకారం తీసుకోవాలని సూచించారు. కుటుంబ ఫొటోతో పాటు డేటాలో పూర్తి వివరాలు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామిరెడ్డి, డీపీఓ పార్థసారథి, ఆర్డీఓ నవీన్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

'మత్తు' వదలరా..!

జిల్లాలో డ్రగ్స్ నియంత్రణకు కార్యాచరణ

- కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు
- వైద్య, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలపై ఫోకస్



మహబూబ్‌నగర్ క్రైం: విద్యార్థి దశ కీలకం.. భవిష్యత్ ఈ దశపైనే ఆధారపడి ఉంటుంది. ఈ దశలో కొందరు యువత చెడు అలవాట్లకు చేరువవుతుంటారు. మత్తు పదార్థాలకు ఆకర్షితులు కావడం కూడా ఇక్కడి నుంచే మొదలవుతుంది. ఇలాంటి యువతను లక్ష్యంగా చేసుకొని మత్తులో దింపేందుకు గంజాయి వ్యాపారులు ప్రయత్నిస్తుంటారు. కళాశాలల్లో చదివే కొందరు విద్యార్థులు గంజాయి, సిగరేట్లకు బానిసై.. అవి లేకుంటే ఉండలేని పరిస్థితి నెలకొంటుంది. సిగరేట్లలో గంజాయి పెట్టి విక్రయిస్తున్నారు. జిల్లాలో గంజాయి ఇతర మత్తు పదార్థాల కట్టడికి కలెక్టర్‌తో పాటు ఎక్సైజ్, పోలీస్ శాఖలు ప్రత్యేక దృష్టి సారించాయి. ప్రధానంగా వైద్య, నర్సింగ్, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు.

ప్రతి గురువారం ఒక కళాశాలలో..

ఈ నెల నుంచి జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ప్రతి గురువారం ఒక కళాశాలలో గంటన్నర పాటు వర్క్‌షాప్ నిర్వహించి మత్తు పదార్థాలు.. వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నారు. కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నత అధికారులు సదస్సుకు హాజరయ్యేలా చర్యలు చేపడుతున్నారు. అక్టోబర్ 17న పాలమూరు యూనివర్సిటీ, 24న నర్సింగ్ కళాశాల ఇలా వేర్వేరు తేదీల్లో వేర్వేరు కళాశాలల్లో సదస్సులు నిర్వహించనున్నారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తూ ప్రతి కళాశాలలో పోలీసు కళాజాతా నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు.


ప్రత్యేక శిక్షణ..

యాంటీ నార్కొటిక్స్ డ్రగ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఉన్న కొన్ని శాఖల నుంచి పలువుర్ని పిలిపించి ఎక్సైజ్, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, ఇంటర్ విద్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఇలా ఒక్కో విభాగం నుంచి ఒకరిని ఎంపిక చేసి డ్రగ్స్ కంట్రోల్ విధానంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి కసరత్తు జరుగుతోంది. ఈ నెలాఖరున శిక్షణ ఇవ్వాల్సి ఉండగా పలు కారణాలతో వచ్చే నెలకు వాయిదా పడింది. శిక్షణ పొందిన అధికారులు ఆయా కళాశాలల్లో సదస్సులు ఏర్పాటు చేసి డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కలిస్తారు.

మోతాదుకు మించితే..

ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు చేసే సమయంలో రోగులకు నొప్పి తెలియకుండా ఉండేందుకు వైద్యులు అవసరమైన మోతాదులో మత్తును ఇస్తుంటారు. ఇలాంటి డ్రగ్స్‌ను అవసరమైన దానికంటే ఎక్కువగా వినియోగిస్తే మనిషిపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు అలవాటు పడిపోతారు. ఇలాంటి మత్తు ఇంజక్షన్లతో నరాల వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది. మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారు అందుబాటులో లేకపోతే ఒక్కోసారి విచక్షణ కోల్పోయి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తారు. కొన్ని సందర్భాల్లో సైకోగా మారి ఇతరులకు నష్టం చేయడం కానీ లేదా తనకు తను గాయపర్చుకోవడం లేదంటే ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు.

డ్రగ్స్‌పై అవగాహన..



మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. జూనియర్ కళాశాలల నుంచి వైద్య కళాశాల, యూనివర్సిటీ ఇలా అన్ని కళాశాలల్లో ఈ నెల నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– డి.జానకి, ఎస్పీ

3 రోజుల పాటు నీటి సరఫరా బంద్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో గురువారం ఉదయం 6 గంటల నుంచి 6వ తేదీ ఉదయం 6 వరకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ వెంకట్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. హైవేపై వేముల స్టేజీ వద్ద రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా భగీరథ పైప్‌లైన్ మార్చాల్సి రావడంతో వల్ల 3 రోజులు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి 'ఓపెన్' సప్లిమెంటరీ పరీక్షలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లావ్యాప్తంగా గురువారం నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.. పిల్లలమర్రి రోడ్డులోని షాషాబ్‌గుట్ట పాఠశాల కేంద్రంలో 300 మంది పదో తరగతి విద్యార్థులు, వన్ టౌన్ వద్ద ఉన్న మహాత్మాగాంధీ రోడ్డు హైస్కూల్‌లో ఓపెన్ ఇంటర్ విద్యార్థుల ఈ పరీక్షలు రాయనున్నారు.

జైలు జీవితం తర్వాత ఉత్తమ జీవనం సాగించాలి

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి
- జిల్లా జైలులో గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం
- హాజరైన, కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు



మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పాపిరెడ్డి. చిత్రంలో కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి, తదితరులు

పాలమూరు: ఖైదీలు శిక్ష కాలంలో సంస్కారం, నైపుణ్యం పెంపొందించుకుని జైలు విడిచి వెళ్లిన తర్వాత మంచి ఆలోచనలతో కుటుంబసభ్యులతో ఉత్తమ జీవనం సాగించాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లోని జిల్లా జైలులో బుధవారం గాంధీ జయంతితో పాటు ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి ప్రధాన న్యాయమూర్తితో పాటు కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి హాజరై పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ ఖైదీలు పరివర్తన చెంది మంచి వైపు అడుగులు వేయాలన్నారు. మనిషి పుట్టుకతోనే ఎవరూ నేరస్తులు కారని, చుట్టూ పరిస్థితుల ప్రభావం, క్షణికావేశంతో చెడు వైపు ప్రయాణించి నేరస్తులుగా మారిపోతారని తెలిపారు. జాతిపిత మహాత్మాగాంధీ అహింసతోనే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నోసార్లు జైలుకు వెళ్లిన గాంధీ.. జైలులో ఉన్న దీన పరిస్థితులు గమనించి ఖైదీలను మనిషిగా చూడాలని, ఖైదీలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రస్తుతం ఖైదీలకు స్వేచ్ఛాయుత వాతావరణంలో అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖైదీలకు పునరావాసంతో పాటు పలు రకాల శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మనిషికి ఉండేది ఒకటే జీవితం అని మళ్లీమళ్లీ నేరాలు చేయకుండా సత్ప్రవర్తనతో జైలు జీవితం తర్వాత కుటుంబంతో జీవించాలన్నారు.

■ కలెక్టర్ విజయేందిర మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో నాయకులు జైలుకు వెళ్లారని తెలిపారు. గాంధీ సిద్ధాంతాలు సత్యం, అహింసను జీవితంలో ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఖైదీలు జైలులో ఉన్న సమయాల్లో అది శిక్షగా కాకుండా తమలోని ఆలోచనలకు పదును పెట్టి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. జైలులో చదువుకోవడంతో పాటు నచ్చిన పని చేయడానికి అవసరమైన కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలన్నారు.

■ ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ ఖైదీలు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. జైలులో క్షణికావేశంలో చేసిన నేరాల కారణంగా శిక్ష అనుభవిస్తున్నారని, కొంత మంది మళ్లీమళ్లీ దొంగతనాలు, దోపిడీలు చేసి వస్తున్నారన్నారు. జైలు జీవితం దిద్దుబాటుకు, మనిషి మార్పునకు ఉపయోగపడాలన్నారు. అనంతరం పలు రకాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, న్యాయమూర్తులు కల్యాణ్ చక్రవర్తి, ఇందిర, జైలు సూపరింటెండెంట్ వెంకటేశం పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



కొత్తకోట రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు వనపర్తి మండలానికి చెందిన పానుగంటి రాములు(37) జ్వరంగా ఉందని, పెబ్బేరుకు వెళ్లి చికిత్స చేయించుకుంటానని ఇంట్లో చెప్పి మంగళవారం ఉదయం బయలుదేరాడు. మంగళవారం అర్ధరాత్రి కదుకుంట్ల స్టేజీ సమీపంలో ఎన్‌హెచ్44పై గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వనపర్తి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య పానుగంటి తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పంచాయతీ కార్మికురాలి హఠాన్మరణం



శంకరమ్మ(ఫైల్)

ధరూరు: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికురాలు శంకరమ్మ(50) అనే మహిళ హఠాన్మరణం చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ధరూరు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా శంకరమ్మ పని చేస్తోంది. బుధవారం ఉదయం చెత్త సేకరణకు ట్రాక్టర్ వెంట గ్రామంలోని కాలనీల్లో తిరిగింది. ఎస్సీ కాలనీలో తనకు కళ్లు తిరుగుతున్నట్లు ఉందని, వాటర్ తాగేందుకు వీరన్న హోటల్‌కు వెళ్లే క్రమంలో కుప్పకూలింది. గమనించిన ట్రాక్టర్ డ్రైవర్, కాలనీ వాసులు ఆమెను కాపాడే ప్రయత్నం చేశారు. వెంటనే 108కు ఫోన్ చేశారు. అది అందుబాటులో లేకపోవంతో ఆమెను ధరూరులోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యుడు ధ్రువీకరించాడు. ఈ విషయం తెలిసిన వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి, ఎంపీఓ సయ్యద్‌ఖాన్‌లు ప్రభుత్వం తరుపున రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఆమెకు భర్త, కుమారుడు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి అనంత లోకాలకు..



రాజు (ఫైల్)

అమరచింత: పొట్టకూటి కోసం చేపల వేటకు వెళ్లిన దివిటి రాజు (40) వలలో చిక్కుకుని మృతి చెందిన ఘటన బుధవారం పట్టణంలో వెలుగు చూసింది. పట్టణంలోని జీఎస్ నగర్‌లో నివాసం ఉంటున్న రాజు మంగళవారం చేపలు పట్టేందుకు పట్టణ శివారులోని బావికి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో వాట్సాప్ గ్రూప్‌లో వ్యక్తి కనబడడం లేదని, ఎవరికైనా కనిపిస్తే సమాచారం ఇవ్వమని పోస్ట్ చేశారు. బుధవారం మధ్యాహ్నం పట్టణ శివారులోని బావి సమీపంలో దుర్వాసన వస్తుండడంతో స్థానిక రైతులు అక్కడికి వెళ్లి చూడగా.. కుళ్లిన మృతదేహం నీటిపై తేలియాడి కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ జమీరుద్దీన్ ఘటన స్థలానికి చేరుకుని మృతుడి వివరాలను వారి కుటుంబ సభ్యులతో పాటు బంధువుల ద్వారా సేకరించారు. మృతుడు రాజు భార్య నాలుగేళ్ల క్రితం చనిపోవడంతో అక్క బాలతో కలిసి ఉంటున్నాడు. అక్క బాల పూలు అమ్ముతుండటంతో.. మృతుడు చేపలు విక్రయించి జీవనం కొనసాగించే వారని మత్స్యకార్మిక సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి రవికాంత్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి ..



మృతుడు

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి (30) జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడని ఎస్ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఎస్ఐ కథనం మేరకు.. మృతుడు ఎల్కిచర్ల నుంచి బిజినేపల్లికి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా.. పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోసుకొని వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో దీంతో బైక్‌పై వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రి వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ వివరించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ చెప్పారు.

ఉత్సవాలకు వేళాయే..

నేటి నుంచి జోగుళాంబ దేవి శరన్నవరాత్రులు

- తొమ్మిది రూపాలలో దర్శనం ఇవ్వనున్న అమ్మవారు



విద్యుత్ దీపాల అలంకరణలో జోగుళాంబ ఆలయం



జోగుళాంబ అమ్మవారు

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. 12వ తేదీవరకు జరిగే ఉత్సవాల్లో అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరిస్తూ ఆరాధించడం ఆనవాయితీ. శరదృతువులో మొదటి రోజుతో ఆరంభమయ్యే అమ్మవారి ఆరాధన ఉత్సవాలు దశమితో ముగుస్తాయి. ఇలా తొమ్మిది రోజుల పాటు ఆ జగన్మాత ఒక్కోరోజు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. సృష్టికి తండ్రి అయిన పరమశివుడు పగలుగా, తల్లి అయిన పార్వతి రాత్రిగా.. ఈ పగలు, రాత్రుల కలయికయే ఒక దినంగా ఏర్పడింది. రాత్రివేళలో అమ్మను తొమ్మిది రోజులు విశేషంగా ఆరాధిస్తారు. కనుక ఈ వేడుకలు నవరాత్రులు అయ్యాయి.

నవరాత్రులలో... తొమ్మిది రూపాలు ఇవే..

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జోగుళాంబ దేవి మొదటి రోజు శైలపుత్రి, 2వ రోజు బ్రహ్మచారిని, 3వ రోజు చంద్రఘంట, 4వ రోజు కూష్మాండ, 5వ రోజు స్కంధ మాత, 6వ రోజు కాత్యాయిని, 7వ రోజు కాళరాత్రి, 8వ రోజు మహాగౌరి, 9 రోజు సిద్ధిధాత్రి దేవిగా జోగుళాంబ దేవిని అలంకరించి ఆరాధిస్తారు.

భక్తుల కోసం ఆలయంలో ఏర్పాట్లు

దేవి శరన్నవరాత్ర బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఆలయాలను, చౌరస్తాలోని ఆర్చిగేట్‌ను, ఆలయ ముఖ ద్వారాలను, రాజగోపురాలను విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే తెప్పోత్సవానికి పకడ్బందీగా ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రధాన రహదారుల దగ్గర, హైదరాబాద్ నగరంలోని ప్రధాన కూడలిలలో అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన హోర్డింగ్‌లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు.

హాజరయ్యే ప్రముఖులు వీరే..!

జోగుళాంబ దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో దేవదాయ శాఖ తరపున మంత్రి కొండాసురేఖ తెలంగాణ ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు తీసుకురానున్నారు. అలాగే వారితో పాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనరసింహ, ఎంపీ మల్లురవి, డీకే అరుణ, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యార్, కమిషనర్ హనుమంతరావు రానున్నారు. అదేవిధంగా ఏపీ ప్రభుత్వం తరపున కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష పట్టు వస్త్రాలు తేనున్నారు. కర్నూలు ఎంపీ నాగరాజు, కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీణ్, తెలంగాణ డీజీపీ జితేందర్, అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, ఐజీ ఎం.రమేష్, ఢిల్లీలో అధికార ప్రతినిధి జితేందర్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, ఎమ్మెల్సీ కోదండరాం, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకటరామి రెడ్డి, గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ తోటశ్రీనివాస్ రావు హాజరు కానున్నారు.

పర్వతాపూర్ మైసమ్మ ఆలయంలో..



పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారు

నవాబుపేట: పాలమూరు జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పర్వతాపూర్ మైసమ్మ ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభించనున్నారు. అమ్మవారి నామస్మరణతో మైసమ్మ అడవి ప్రాంతం మార్మోగనుంది. దసరా సెలవులు సైతం ఉండడంతో భక్తులు అధికసంఖ్యలో అమ్మవారి దర్శనానికి వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆలయ ఈఓ మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఒక్కోరోజు ఒక ప్రత్యేకరూపంలో అమ్మవారి దర్శనం ఇప్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉత్సవాల వివరాలు ఇలా..

తేదీ	వేడుక
3	కలశ స్థాపన, గణపతి పూజ
4	ప్రత్యేక అలంకరణ ప్రారంభం
5	అభిషేకం
6	ప్రత్యేక అలంకరణ
7	పంచమి ప్రత్యేక పూజ
8	ప్రత్యేక అలంకరణ దర్శనం
9	సరస్వతీ పూజ, చండీహోమం, పూర్ణాహుతి
10	ఆయుధ పూజ
11	దేవి పూజ
12	శమీపూజ, దసరా ఉత్సవం, మంగళహారతితో ముగింపు

సత్యశోధన పాదయాత్ర ప్రారంభం

జోగుళాంబ అమ్మవారి చెంత నుంచి యాత్ర



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు తదితరులు

అలంపూర్ : పిల్లల భవిష్యత్తు కోసం సత్యశోధన పాదయాత్ర చేపట్టినట్లు.. సత్యశోధన కమిటీ నాయకులు డాక్టర్ సువార్చక విజయ్ కుమార్ అన్నారు. అలంపూర్ పట్టణంలో వెలిసిన శ్రీజోగుళాంబ అమ్మవారి ఆలయం నుంచి సత్యశోధన పాదయాత్ర గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడారు. భవిష్యత్ తరాలు బాపు బాటలో నడవాలని పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలన్నారు. యువత మద్యం, మత్తు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. భవిష్యత్ తరాలను బాగు చేయడానికి అందరు కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వీటిని సాధించడమే లక్ష్యంగా పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. వంద రోజులు 1000 కిలోమీటర్ల మేర పాదయాత్ర జరగనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు, వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి, గ్లోబల్ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి, గీతా ఫౌండేషన్ చైర్మ్ బడే సాబ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు వెంకట్రామయ్య శెట్టి, రమేష్ గుప్తా, నాయకులు నాగేంద్ర తదితరులు ఉన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్‌లో కీలక మలుపు

అసలు సూత్రధారుడిపై చర్యలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఒంటరి జంటలను ఫొటోలు తీసి బెదిరింపులకు పాల్పడి నగదు వసూలు చేశారన్న ఇద్దరు కానిస్టేబుళ్లపై విచారణ చేసి జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఆరోపణలు ఎదుర్కొన్న కానిస్టేబుల్ చెన్నయ్య, రామచంద్రయ్యలను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ గత నెల 25న ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్ చెన్నయ్య ఒంటరి జంటల ఫొటోలు తాను తీయలేదని ఎలాంటి బెదిరింపులకు పాల్పడలేదని న్యాయం చేయాలని జిల్లా ఎస్పీని కలిసి విన్నవించాడు. ఈ నేపథ్యంలోనే పోలీసు ఉన్నతాధికారులు మరోసారి విచారణ చేసి ఒంటరి జంటల ఫొటోలు తీసి బెదిరింపులకు పాల్పడి నగదు వసూలు చేసిన అసలు సూత్రధారుడు కానిస్టేబుల్ రాము అని నిర్ధారించుకొని జిల్లా ఎస్పీకి నివేదిక అందజేశారు. జిల్లా ఎస్పీ నివేదికను పరిశీలించి అసలు సూత్రధారి కానిస్టేబుల్ రామును బుధవారం విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు నాగర్ కర్నూల్ సీఐ కనకయ్యగౌడ్ తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొన్న కానిస్టేబుల్ చెన్నయ్యను స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధుల్లోకి తీసుకున్నట్లు తెలిసింది.

కాంగ్రెస్ అధ్యక్ష పదవులను బీసీలకే కేటాయించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని ఐదు జిల్లాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బీసీలకు కేటాయించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్ని రోజుల క్రితం ప్రకటించిన రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌లలో కూడా అగ్రవర్ణ సామాజిక వర్గాలకు పెద్దపీట వేసి బీసీలకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని జిల్లా అధ్యక్ష పదవులతో పాటు జిల్లాస్థాయిలోని ప్రధానమైన నామినేటెడ్ పోస్టులు అత్యధిక స్థానాలు బీసీలకు కేటాయించాలని కోరారు. పదవుల్లో బీసీలకు పెద్దపీట వేయాలని లేనిపక్షంలో భవిష్యత్‌లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తోందని హెచ్చరించారు.

భక్తులతో కురుమూర్తి కొండలు కిటకిట

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి దర్శనానికి అమవాస్యను పురస్కరించుకొని బుధవారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అర్చకులు సుప్రభాత సేవ అనంతరం భక్తులకు స్వామివారి దర్శన అవకాశం కల్పించారు. ఉదయం నుంచే ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి క్యూలైన్లో నిల్చున్నారు. మెట్లపై దీపాలు వెలిగించారు. కొందరు మెట్టు మెట్టుకు కొబ్బరికాయలు కొట్టి స్వామి చెంతకు చేరి దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారు చేసి స్వామికి సమర్పించారు. అనంతరం కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తులు దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తుల రద్దీతో కనిపించింది.



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



రాజగోపురం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



క్యూలైన్లో భక్తులు..

కృష్ణానదిపై వంతెన నిర్మించాలని మంత్రికి ఎమ్మెల్యే వినతి



వైద్యారోగ్య శాఖ మంత్రికి వంతెన నిర్మాణం పై వివరిస్తున్న ఎమ్మెల్యే

అమ్రాబాద్: పదర మండలం మద్దిమడుగు క్షేత్రం సమీపంలోని కృష్ణానదిపై (రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దు) వంతెన నిర్మాణం చేపట్టాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహకు విన్నవించారు. మంగళవారం శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనం కోసం వెళ్లిన మంత్రి బుధవారం తిరుగు ప్రయాణంలో మండలంలోని మన్ననూర్ అటవిశాఖ గెస్ట్‌హౌజ్‌లో సేదతీరారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసిన ఎమ్మెల్యే అచ్చంపేట నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. కృష్ణానదిపై వంతెన నిర్మిస్తే రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు ప్రయాణ దూరం తగ్గుతుందన్నారు. ముఖ్యంగా పదర, అమ్రాబాద్, అచ్చంపేట మండలాలు మరింత అభివృద్ధి చెందుతాయని, ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డికి తెలుసన్నారు. వంతెన నిర్మాణానికి మంత్రి సహకారం అందించాలని కోరారు. అనంతరం నల్లమల తేనెను కాంగ్రెస్ నాయకులు మంత్రి అందజేశారు.

తగ్గిన ఇన్‌ఫ్లో.. జూరాల గేట్లు మూసివేత



మూసివేసిన జూరాల ప్రాజెక్టు క్రస్టు గేట్లు

ధరూరు/ఆత్మకూరు/శ్రీశైలం: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్ ఫ్లో తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి 84,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం సాయంత్రం 7 గంటల వరకు 55,800 క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ చెప్పారు. దీంతో ప్రాజెక్టు క్రస్టు గేట్లను బుధవారం ఉదయం మూసివేసినట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 41,039 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 94 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,140 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 700 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 44,454 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.418 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

➡ జూరాల ఎగువ, దిగువ విద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, 220.143 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 195.234 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 415.377 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

➡ శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 881.2 అడుగుల వద్ద 194.3096 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 45,181 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,163 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 9,396 మొత్తం 45,559 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 13,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,520 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

ఒక గేటు ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసులలో ఒక గేటు ద్వారా నీటి విడుదల చేస్తున్నట్లు జేఈ రాజు తెలిపారు. బుధవారం ఎగువ నుంచి 6,891 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా... ఒక గేటును తెరిచి 4,446 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు పేర్కొన్నారు.

గాంధీజీ ఆశయ సాధనే ముఖ్యం



మహనీయుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న డీఐజీ చౌహాన్, ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ క్రైం: గాంధీజీ అనుసరించిన సత్యం, అహింసా సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ పిలుపునిచ్చారు. పోలీస్ వ్యవస్థలో అనుసరించాల్సిన విలువలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి జయంతిని పురస్కరించుకొని బుధవారం డీఐజీ కార్యాలయంలో ఎస్పీ డి.జానకితో కలిసి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీసులు ప్రజలకు సేవ చేయడంలో నిబద్ధతతో ఉండాలని, గాంధీజీ స్ఫూర్తిని ప్రతి రోజు తమ పనిలో చూపించాలని సూచించారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో సైతం గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు సిబ్బంది నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రాములు, సురేష్ కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో 'క్షుద్ర' పూజల కలకలం..



దారిలో వేసిన మనిషిని పోలిన బొమ్మ

పాన్‌గల్: వనపర్తి జిల్లాలోని పాన్‌గల్ మండలం కేతేపల్లి శివారులోని గుండ్ల చెరువుకు వెళ్లే దారిలో క్షుద్ర పూజలు కలకలం రేపుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పసుపు, కుంకుమ, తెల్లని పిండితో మనిషిని పోలిన బొమ్మను గీశారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇదే దారి గుండా రైతులు పంట పొలాలకు వెళ్తుంటారు. మనిషిని పోలిన బొమ్మను వేయడంతో ఆ దారి గుండా వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. ఎవరికి అయిన చేతబడి చేసేందుకు క్షుద్ర పూజలు చేశారా.. లేకుంటే మరో కోణం ఏమైనా ఉందా? అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో మనిషిని పోలిన బొమ్మ వేసి క్షుద్ర పూజలు చేశారనే విషయంపై సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు గ్రామాల్లో రాత్రి వేళల్లో పోలీసులు గస్తీని పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం

జడ్చర్ల: మండల పరిధిలోని పోలేపల్లికి చెందిన యువకుడు అప్పుల బాధతో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. పోలేపల్లికి చెందిన నగేష్(18) తల్లిదండ్రులు లేకపోవటంతో కుటుంబ పోషణకు తరుచూ అప్పులు చేస్తుండేవాడు. కాగా అవి కాస్తా పెరగడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. మనస్తాపంతో మంగళవారం ఇంట్లో చెప్పకుండా వెళ్లి పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నగేష్ ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు వెతికారు.. చివరికి గ్రామస్తులు చూసి సమాచారం ఇవ్వడంతో అతడు ఉరి వేసుకున్నట్లు బుధవారం గుర్తించారు. కుటుంబ సభ్యులు విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

జడ్చర్ల: కొండేడుకి చెందిన జంగయ్య(56) పురుగు మందుతాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జంగయ్యకు కల్లు తాగే అలవాటు ఉంది. కానీ ఇటీవల కుటుంబ సభ్యులు కల్లును మాన్పించారు. దీంతో తరుచూ తాను చనిపోతానంటూ మనస్తాపం చెందేవాడు. ఇలా ఉండగా గత నెల 25న పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన బుధవారం మృతి చెందాడు. అతడి కుమారుడు మహేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

మావోయిస్టు పేరుతో డబ్బులు డిమాండ్

ఖిల్లాఘనపురం: మావోయిస్టు పేరుతో డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘపురం మండలం సోళీపురం గ్రామానికి చెందిన తీనేటి శేఖర్‌రెడ్డికి మంగళవారం రాత్రి సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి ఫోన్ చేసి.. 'నక్సలైట్‌ను మాట్లాడుతున్నాను రూ.50 లక్షలు ఇవ్వకపోతే నిన్ను, నీ కుటుంబ సభ్యులను చంపుతానని' బెదించాడని పేర్కొన్నారు. శేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.